క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

మహారాణిపేట: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని పాతనగరం మెయిన్‌రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం మన్యుసూక్త హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిస్వార్థ సేవకు జ్ఞానీ జైల్‌సింగ్ పురస్కారం



గణేష్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఏపీజేయూ స్థాపించి ఐదేళ్లయిన సందర్భంగా రాష్ట్రంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వ్యక్తులను గుర్తించి, వారిని భారత మాజీ రాష్ట్రపతి జ్ఞానీజైల్ సింగ్ స్మారక పురస్కారంతో విజయవాడలో సత్కరించారు. 30 ఏళ్ల పాత్రికేయ వృత్తిలో నిస్వార్థ సేవలు అందిస్తున్న రథో గణేష్‌కు ఈ పురస్కారాన్ని అందించారు. గణేష్ వీడియో జర్నలిస్టుగా సేవలందిస్తూ, పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు నిర్వహిస్తూ లిమ్కా, ఏషియన్, ఇండియన్ రికార్డులు సైతం సొంతం చేసుకున్నారు. 6 బెస్ట్ వీడియో జర్నలిస్టు, 24 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు కూడా సొంతం చేసుకున్నారు.

శోభాయమానం.. అన్నమయ్య జయంత్యుత్సవం



శోభాయాత్రలో పాల్గొన్న నగరవాసులు

ఏయూక్యాంపస్: తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సోమవారం బీచ్ రోడ్డులో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కాళీ మాత ఆలయం నుంచి అన్నమయ్య విగ్రహం వరకు యాత్ర సాగింది. సబ్‌మెరైన్ ఎదురుగా ఉన్న అన్నమాచార్య విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు, అన్నమయ్య సంకీర్తన గోష్ఠి, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటం ప్రదర్శనలు నిర్వహించారు.

ఘనంగా చిన పోలమాంబ తొలేళ్ల సంబరం



నిజరూపంలో చిన పోలమాంబ

మద్దిలపాలెం: శివాజీపాలెం, పీతలవానిపాలెం గ్రామదేవత చిన పోలమాంబ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. 8వ రోజు అమ్మవారి నిజరూప దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి తాపం నుంచి ఉపశమనానికి చలివేంద్రాలు పెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తొలేళ్ల ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక ప్రదర్శనలకు శివాజీపాలెం, పీతవానిపాలెం, డాక్టర్స్ కాలనీలో ప్రత్యేక స్టేజ్‌లు ఏర్పాటు చేశారు.

నేడు ప్రధాన పండగ

ఉత్సవాల్లో ఆఖరి రోజు మంగళవారం చిన పోలమాంబ అమ్మవారి ప్రధాన పండగ జరగనుంది. భక్తులకు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశామని శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేశారు.

రహదారిపై ప్రయాణిస్తుండగా.. బైక్ పెట్రోల్ ట్యాంక్ నుంచి మంటలు.. ఎండలకు కార్ ఇంజిన్ వేడెక్కి చెలరేగిన మంటలు.. తప్పిన పెను ప్రమాదం.. ఇలాంటి వార్తలు తరచూ మండు వేసవిలోనే చూస్తుంటాం. ఎండా కాలంలో మన ఆరోగ్యంతోపాటు, పశుపక్ష్యాదుల సంరక్షణపై ఎంత జాగ్రత్త వహిస్తామో.. వాహనాలపై కూడా అంతే దృష్టి సారించాలి. రోళ్లు పగిలే రోహిణీ కార్తెకు మరో పక్షం రోజులే గడువు. ఈ సమయంలో మన వాహనాల భద్రతపై నిపుణుల సూచనలివీ..

వేసవి కాలం.. వాహనాలు భద్రం



రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో మండుటెండలోనే వాహనాలు



ద్వారకా బస్ కాంప్లెక్స్ పార్కింగ్‌లో ద్విచక్రవాహనాలు



దాబాగార్డెన్స్: ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ వేడి తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. వేసవిలో మన ఆరోగ్యం పట్ల ఎలా జాగ్రత్తలు పాటిస్తామో.. వాహనాలను సైతం అలానే కాపాడుకోవాలి. వాహనాలు ఎండలో గంటల సమయం ఉండడం వల్ల కలర్ షేడ్ అవుతాయి. పెట్రోల్ ఆవిరయ్యే అవకాశం ఉంటుంది. వాహనాలకు ట్యాంక్ నిండా పెట్రోల్ పట్టిస్తే ఒక్కోసారి పేలే ప్రమాదం కూడా ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలకు..

- వాహనాలను ఎక్కువసేపు పార్కింగ్ చేయాల్సి వస్తే చెట్టు నీడన గానీ, షెడ్లలో లేదా కవర్లు కప్పి ఉంచాలి.
- ఎండ వేడికి రంగు వెలిసిపోయి కొత్త వాహనాలు సైతం పాతవిగా కనిపిస్తాయి.
- అధిక ఉష్ణోగ్రతల వల్ల టైర్లలో గాలి తగ్గిపోతుంది. వారానికోసారి గాలి తనిఖీ చేయించుకోవడం మంచిది.
- గాలి ఎక్కువ కొట్టించడం వల్ల వేడికి టైర్లు కరిగి పేలిపోతాయి. తగిన మోతాదులో మాత్రమే గాలి నింపుకోవాలి.
- ద్విచక్రవాహనాలు ఎక్కువ సమయం ఎండలో ఉంచితే పెట్రోల్ ఆవిరి అయిపోయే అవకాశం ఉండటమే కాకుండే.. కొన్నిసార్లు మండిపోయే ప్రమాదం ఉంది.
- పగటి ఉష్ణోగ్రతల్లో ఎండ వేడికి పెట్రోల్ ట్యాంక్‌లో గ్యాస్ ఏర్పడుతుంది. రాత్రి ఇంటికి చేరుకున్నాక ఓ సారి పెట్రోల్ ట్యాంక్ మూత తీసి, మళ్లీ బిగిస్తే మంచిది.
- **వేసవిలో పగలు కన్నా సాయంత్రం వేళల్లో పెట్రోలు పట్టించడం మంచిది.**
- వేసవిలో ద్విచక్ర వాహనాలపై దూర ప్రయాణం చేయడం వీలైనంత వరకు తగ్గించుకోవాలి.
- దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు వాహనాల వేగానికి, ఉష్ణోగ్రతల వేడికి ఇంజిన్ రెండింతలు వేడెక్కే అవకాశం ఉంటుంది. అందు కోసం కొంత దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంజిన్ కాసేపు ఆపితే.. ప్రమాదాన్ని నియంత్రించవచ్చు.

కార్లు, భారీ వాహనాలైతే ఇలా..

- కార్లు, లారీలు ఇతర భారీ వాహనాల విషయంలో రేడియేటర్లలో నీళ్లను తరచూ తనిఖీ చేసుకోవాలి.
- రేడియేటర్లలో నీళ్లకంటే కూలెంట్ ఆయిల్ వాడడం మంచిది.
- వేడికి ఇంజిన్ ఆయిల్ తగ్గే అవకాశాలు ఉంటాయి. తప్పనిసరిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలి.
- పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ ద్వారా వాహనాలు నడిపేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అటువంటి వాహనదారులు వేసవిలో గ్యాస్ కిట్‌ను ఉపయోగించకుండా ఉంటే ఉత్తమం.
- ఏసీ నిలబడాలంటే కారు అద్దాలకు క్లాత్ మ్యాట్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- ఎండాకాలం వెళ్లే వరకూ భారీ వాహనాలకు నూతన టైర్లు వాడితే మేలు. లేదంటే దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో పాత టైర్లలో గాలి తగ్గిపోయి పేలిపోయే ప్రమాదం ఉంది.

వేసవిలో ఫుల్‌ట్యాంక్ ప్రమాదం



ఈ ఏడాది ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్‌లకు ఫుల్ ట్యాంక్ చేయించడం వల్ల పేలిపోయే ప్రమాదం ఉంది. మూడు లేదా నాలుగు లీటర్ల పెట్రోలు వరకు వేయించుకుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉండదు. ఒక వేళ బైక్ ఎండలో పెట్టాల్సిన అవసరం ఏర్పడితే ఏదైనా పొడవాటి క్లాత్‌ను ట్యాంక్‌పై కప్పి ఉంచితే సరిపోతుంది. లేదంటే ఎండలకు ఆయిల్ ట్యాంకర్ హీటెక్కి పేలిపోయే ప్రమాదం ఉంది.
– గౌతమ్, టూ వీలర్ మెకానిక్, కలెక్టరేట్ ఏరియా

దూర ప్రయాణాలు పెట్టుకోవద్దు



ద్విచక్ర వాహనాలను ఎక్కువగా వినియోగించే వారు ఎండాకాలంలో జాగ్రత్తగా ఉండాలి. ట్యాంక్ నిండుగా పెట్రోల్ పోయించడం, పెట్రోల్ పోయించేటపుడు సెల్ ఫోన్ మాట్లాడటం, బైక్‌ను ఎక్కువ సమయం ఎండలో ఉంచడం లాంటివి సరికాదు. బైక్‌ను మధ్యాహ్న సమయంలో ఎక్కడైనా పార్కింగ్ చేయాల్సి వస్తే.. నీడపాటున పార్కు చేయాలి. ఎండలో దూర ప్రయాణాలు మానుకోవాలి.
– శివప్రసాద్, శ్రీసాయిగణేష్ బైక్ మెకానిక్స్, అల్లిపురం

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.17.46 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు కాన్వెంట్ కూడలి పరిధి జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 46 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించిన ఆదాయం కలిపి రూ.17,46,974 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు ఎం.నీలిమ, పి.శేఖర్‌బాబు పర్యవేక్షణలో దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా endow&eokanaka@gov. in ఇ–మెయిల్ ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు.

కేసీఎస్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

దాబాగార్డెన్స్: పోర్టు ప్రహరీలపై రంగుల బొమ్మలు వేసిన కళాకారుల కష్టార్జితం ఎగ్గొట్టడానికి కుట్ర చేయడమే కాకుండా, కళాకారులను గూండాలతో బెదిరించిన కేసీఎస్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు వై.రాజు డిమాండ్ చేశారు. పోర్టు యాజమాన్యం కాంట్రాక్టర్ నుంచి కళాకారుల లేబర్ చార్జీలు ఇప్పించాలని కోరారు. ఈ మేరకు సోమవారం జగదాంబ జంక్షన్ సమీపాన సిటు కార్యాలయంలో మీడియా సమావేశంలో రాజు మాట్లాడారు. 10 మంది కళాకారులు కేసీఎస్ కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యం వద్ద ఏడాది పాటు మండుటెండలో పనులు చేశారన్నారు. పనులు పూర్తయి 4 నెలలు గడచినా, కాంట్రాక్టర్ లేబర్ చార్జీ చెల్లించకుండా కాలయాపన చేయడంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిత్రకారుల్లో అత్యధికులు ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలని పేర్కొన్నారు. చిత్రకారులకు చెల్లించాల్సిన రూ.11 లక్షల 7వేలు కాంట్రాక్టర్ ఎగ్గొటాలని కుట్ర చేస్తున్నారని తెలిపారు. పోర్టు అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేసి 3 వారాలు గడచినా, ఇంతవరకు చర్యలు చేపట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ పోర్టులో కార్మిక చట్టాల ఉల్లంఘన జరగడం విచారకరమని, అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్.సూరిబాబు, సీహెచ్ రాజ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బల్లిగిరి వెంకన్న తిరు కల్యాణోత్సవాలు

- వైభవంగా సహస్ర ఘటాభిషేకం, చక్రస్నానం
- భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకస్వామి



సహస్ర కలశ పూజలో అర్చకులు

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 8న స్వామి తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం అష్టోత్తర శత కలశ స్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థ నిర్వహించారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీరరాఘవాచార్యులు, గొడవర్తి రామచంద్రాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం కళశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం చేశారు. ముందుగా పూర్ణాహుతి జరిపారు. కల్యాణోత్సవాలు ముగింపు సందర్భంగా చక్రస్నానాన్ని భక్తి శ్రద్ధలతో చేపట్టారు. సాయంత్రం ధ్వజారోహణం జరిపారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో బల్లిగిరి మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

నేడు పుష్పయాగం..

కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జీవీ రమాబాయి తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాల్సిందిగా కోరారు.

సేవ, త్యాగానికి నిదర్శనం నర్సులు

- పదోన్నతి పొందిన హెడ్ నర్స్ ఇందిరకు సన్మానం



నర్సును సన్మానిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

మహారాణిపేట: ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా నర్సుల దినోత్సవాన్ని కేజీహెచ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం ఆధ్వర్యంలో ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, డీసీఎస్ ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలందించే విషయంలో నర్సుల సేవలను వైద్యులు కొనియాడారు. అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్న సీనియర్ హెడ్ నర్సు మద్దిరాల ఇందిరకు పాడేరు గవర్నమెంట్ ఆస్పత్రి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి లభించడంతో ఆమెను అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ సీహెచ్.పద్మావతి, గ్రేడ్–2 కల్పనామాళి, సుగీత స్వర్ణలత, అసోసియేషన్ అధ్యక్షురాలు టి.గంగాభవానీ, కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి, పలువురు సీనియర్ హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి బౌద్ధమే మార్గం



మహనీయుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శనం తదితరులు

సీతంపేట: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అశాంతి, అసమానతల నిరోధానికి బౌద్ధమే ఏకైక మార్గమని భారతీయ బౌద్ధ మహాసభ (బీఎస్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు బేతాళ సుదర్శనం పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం గౌతమ బుద్ధుడి 2,569వ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, రాహుల్ సాంకృత్యాయన్, సామ్రాట్ అశోకుడి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ బుద్ధుడు వేల ఏళ్ల కిందటే అశాంతికి పరిష్కార మార్గం చూపారన్నారు. మనిషి కోరికలపై అదుపు ఉన్నప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని బుద్ధుడు బోధించినట్టు తెలిపారు. బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అసమానతలకు పరిష్కారం పంచశీల మార్గమే సరైనదని అంబేడ్కర్ సూచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ టెక్నికల్ ఆఫీసర్ ఎస్.రేణుకుమార్, రచయిత బండి సత్యనారాయణ, బీఎస్ఐ రాష్ట్ర కార్యదర్శి పి.వి.సుబ్బారావు, ఎం.మల్లయ్యరాజు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు వాసుపల్లి చేయూత



రాజేష్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వాసుపల్లి

అల్లిపురం: వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న 34వ వార్డుకు చెందిన ఉమ్మడి రాజేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రూ.10 వేలు సాయం అందజేశారు. ఆయన స్వయంగా రాజేష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతోమంది పేదలకు వైఎస్సార్ కార్పొరేట్ వైద్యం అందించారని, ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి అందులో మరిన్ని సేవలు చేర్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండ రమణ, పార్టీ సీనియర్ నాయకుడు లింగం శ్రీను, అంబటి అప్పలరాజు, దూడ అప్పారావు, సౌత్ క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు సువార్త రాజు, 39వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

వినతులను వెంటనే పరిష్కరించాలి



జోన్–4 కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



అర్జీలు పరిశీలిస్తున్న జెడ్సీ రాము

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 4 వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ విభాగానికి 3, ఎలక్ట్రికల్ విభాగానికి 1 వినతి వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పరిష్కారమైన తర్వాత వినతుల్లో ఇచ్చిన ఫోన్ నంబర్ ద్వారా అర్జీదారులను సంప్రదించి, సమస్య పరిష్కారమైందా అడిగి తెలుసుకోవాలన్నారు. పరిష్కారమైన సమస్యలను రికార్డుల్లో రాసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఝాన్సీ, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

జోన్–5 లో..

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అర్జీలను స్వయంగా స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్‌కు 02, పబ్లిక్ హెల్త్ యూసీడీకి 01. రెవెన్యూ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, అలసత్వం తగదని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, ఏపీడీవోలు కృపానందం, పుణ్యవతి, విద్యుత్ దీపాల ఏఈ అర్చన, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి, టీపీవో ప్రవీణ్, సర్వేయర్ లీలావతి, మంచినీటి విభాగం ఏఈ సుమన్ పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు



బుద్ధ జయంతి వేడుకల్లో పాల్గొన్న బౌద్ధ భిక్షువులు, బర్మా కాందిశీకులు

కంచరపాలెం: స్థానిక బర్మాక్యాంప్ బౌద్ధాలయంలో జిల్లా మహాబోధి సొసైటీ ప్రతినిధి గునుపూడి బాబులు ఆధ్వర్యంలో సోమవారం 2569వ బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ప్రభాకర్ బౌద్ధ పుంగవులతో కలిసి గౌతమ్ బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బర్మా–ఆంధ్ర కాందిశీకుల కేంద్ర సంఘం వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు బర్మా అర్జునరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచ శాంతికి బౌద్ధమే శరణ్యమని ప్రభాకర్ కొనియాడారు. ఈ సందర్భంగా 47వ వార్డు అధ్యక్షుడు గుణుపూడి అరుణబాబు, జై భీమ్ సంస్థ నగర కన్వీనర్ కోన ప్రకాష్, డాక్టర్ రమేష్, కొప్పిశెట్టి ప్రసాద్‌ల చేతుల మీదుగా 100 మంది వృద్ధులకు దుస్తులు, రేషన్ సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్య, అరుణ, హనుమంతు, సాయిచరణ్, ఆనంద్‌బాబు, శంకర్, రాజు, నాగరాజు, భాను నరేష్, సోమేశ్వరి, ముసలయ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం పిల్లలకు వైద్య సేవలు

తాటిచెట్లపాలెం: పేద ముస్లిం పిల్లలకు సీరత్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో ఉచిత ఖత్నా(సున్తీ) వైద్య శిబిరం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షుడు హైదర్ ఆలీ సింకా మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాంతాల్లోని పేద ముస్లింల పిల్లలకు ఉచితంగా సున్తీ చేస్తున్నట్లు తెలిపారు.సున్తీ అనంతరం చిన్నారులకు మందులు, హెల్త్ డ్రింక్స్ అందజేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి మధ్యాహ్న భోజనాన్ని కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకులు మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని సుధా విద్యానికేతన్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం కలుసుకున్న వీరు రోజంతా సందడి చేశారు. నృత్య భారతి డ్యాన్స్ అకాడమీ చిన్నారుల ప్రదర్శన అలరించింది. చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జనార్దన్‌రావు దంపతులను, నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.